# సాక్షి
## సూర్యాపేట

శనివారం । 26 । ఆగస్టు । 2023






**క్యాంప్ కార్యాలయం ముట్టడి**

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలని శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో సూర్యాపేటలో మంత్రి క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడించారు. - 8లో



**అప్పల పాలు చేసిన మోదీ**

ప్రధాని మోదీ పాలనలో దేశాన్ని అప్పల పాలు చేశారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆరోపించారు. - 8లో



**రూ.90కోట్లతో 'సాగర్' పనులు**

రూ.90 కోట్లతో సాగర్ ప్రాజెక్టు నిర్వహణ పనులు చేపట్టినట్లు ఇరిగేషన్ శాఖ ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ తెలిపారు. - 8లో

## న్యూస్‌రీల్

### గురుకుల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సస్పెన్షన్

**హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. పాఠశాలలో ఇటీవల నేరేడచర్ల మండలం బక్కయ్యగూడెం గ్రామానికి చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకున్నారు. దీంతో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ మీరాబిని సస్పెండ్ చేస్తూ ఆ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసినట్లు బీసీ గురుకులాల ఆర్‌సీఓ షకీనా శుక్రవారం తెలిపారు.

### టీటీడీ బోర్డు మెంబర్‌గా సాముల రాంరెడ్డి



**హుజూర్‌నగర్ :** హుజూర్‌నగర్‌కు చెందిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కాగా, టీటీడీ సభ్యుడిగా నియమితులైన సాముల రాంరెడ్డికి పలువురు నాయకులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

### హుజూర్‌నగర్ ఏపీఓకు మెమో జారీ

- హాజరు రిజిస్టర్‌లో ముందు రోజే సంతకం చేసినందుకు చర్యలు

**హుజూర్‌నగర్ రూరల్:** హాజరు రిజిస్టర్‌లో ముందు రోజే సంతకం చేయడంపై హుజూర్‌నగర్ ఏపీఓకు మెమో జారీ చేసినట్లు ఎంపీడీఓ శాంతకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విధులకు హాజరయ్యాక శుక్రవారం పెట్టాల్సిన సంతకాన్ని ఏపీఓ శైలజ గురువారమే మండల పరిషత్ కార్యాలయంలోని హాజరు రిజిస్టర్‌లో పెట్టిన విషయం విదితమే. ఈ వ్యవహారంపై హెచ్చరించడంతో పాటు సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ ద్వారా సదరు ఏపీఓకు గురువారం సాయంత్రమే మెమో జారీ చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

### ప్రభుత్వ భూమిని కాపాడాలి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందిస్తున్న ప్రజాపంథ నాయకులు

**దురాజ్‌పల్లి (సూర్యాపేట):** జిల్లాలోని నేరేడుచర్ల మున్సిపాలిటీ శివారులో గల ప్రభుత్వ భూమిని కాపాడాలని ప్రజాపంథ జిల్లా నాయకులు నాగన్న, వాస పల్లన్న కోరారు. ఈ మేరకు శుక్రవారం సూర్యాపేటలోని నూతన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరేడుచర్ల సర్వే నంబర్ 243, 244లో గల ప్రభుత్వ భూమిలో 2018 నుంచి పేదలు గుడిసెలు వేసుకొని నివాసముంటుంటే రెవెన్యూ, పోలీస్ అధికారులు అనేకసార్లు వచ్చి గుడిసెలు తీసివేసి వారిపై కేసులు పెట్టి జైలుకు పంపారని పేర్కొన్నారు. అదే భూమిని నేడు అధికార పార్టీ నాయకులు కొందరు ఆక్రమించుకుంటుంటే స్థానిక తహసీల్దార్ వారికే సపోర్ట్ చేస్తున్నారని ఆరోపించారు. ఆ భూమిని పేదలకు పంచి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వీరబాబు, పావని, మరియమ్మ, చంద్రమ్మ, లక్ష్మి, కోటమ్మ ఇతరులు పాల్గొన్నారు.

### జాతీయ దళిత సమ్మేళనానికి ఎంపిక



కోట గోపి

**దురాజ్‌పల్లి (సూర్యాపేట):** హైదరాబాద్‌లోని బేగంపేట పీపుల్స్ ప్లాజాలో శని, ఆదివారాల్లో జరగనున్న జాతీ య దళిత సమ్మేళనానికి ప్రతినిధిగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం జిల్లా కేంద్రంలో విలేకరులకు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సమ్మేళనానికి 26 రాష్ట్రాల నుంచి 80 సంఘాలకు చెందిన 300 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

### సూర్యాపేట సైబర్ క్రైం డీఎస్పీగా రవికుమార్

**సూర్యాపేట క్రైం:** సూర్యాపేట సైబర్ క్రైం డీఎస్పీగా ఎస్.రవికుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన డీజీపీ కార్యాలయం నుంచి సూర్యాపేటకు వస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

# ప్రతిభ ఉంటే అవార్డులు వరిస్తాయి



- శాస్త్రీయ సంగీతమే అన్నింటికి మూలం
- యువత సాహిత్యంపై దృష్టిపెట్టాలి

**జాతీయ చలన చిత్ర అవార్డు గ్రహీత డాక్టర్ పురుషోత్తమాచార్య**

**రామగిరి(నల్లగొండ):** జాతీయ చలన చిత్ర అవార్డుకు నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ ముడుంబై పురుషోత్తమాచార్య ఎంపికయ్యారు. గురువారం ప్రకటించిన 69వ జాతీయ చలన చిత్ర అవార్డులు–2021కి గాను ఉత్తమ సినీ విమర్శకుడి కేటగిరీలో ఆయనకు అవార్డు దక్కింది. జాతీయ చలన చిత్ర ఉత్తమ సినీ విమర్శకుడిగా ఎంపికైన సందర్భంగా 'సాక్షి'తో పంచుకున్న అనుభవాలు ఆయన మాటల్లో..

నేను హుజూర్‌నగర్‌లో జన్మించాను. నాన్న వెంకటనరసింహాచార్యులు సంగీత విద్వాంసుడు. తాత రంగాచార్యులు సంస్కృత పండితుడు కావడంతో నాకు చిన్న నాటి నుంచే సంగీతంతో పాటు సాహిత్యం పట్ల ఆసక్తి ఉండేది. 1975 సంవత్సరంలో నల్లగొండ పట్టణానికి వచ్చి స్థిర పడ్డాను. తెలుగు సబ్జెక్టులో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ (ఎం.ఏ) చదివాను. అనంతరం చందాల కేశవదాసు సాహిత్యంపై పరిశోధన చేసినందుకు గాను 2003వ సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీలో డాక్టరేట్ పొందాను.

**26 రచనలు..**

ఇప్పటి వరకు 26 రచనలు చేశాను. అందులో వచన, పద్య, గేయాలు, పద్య నాటకాలు, సాంఘిక నాటకాలు ఉన్నాయి. భక్తి గీతాలు, జోగులాంబ చరిత్ర, రేణుకా ఎల్లమ్మ చరిత్రను పాటల రూపంలో రికార్డింగ్ చేశాను. 1982 సంవత్సరంలో అన్నమాచార్య సంకీర్తన ప్రచార సమితిని స్థాపించి ప్రతి నెల 16 తేదీన తెలుగు రాష్ట్రాల్లో ఉన్న గాయకులతో అన్నమయ్య సంకీర్తనలో సంగీత విభావరి నిర్వహిస్తున్నా. ఇటీవల 500 నెలల కార్యక్రమం పూర్తయింది. 1989లో నాద బ్రహ్మ సంగీత కళాశాలను ఏర్పాటు చేశాను. సంగీత సాహిత్యంలో చేసిన సేవలకు గాను ఇప్పటి వరకు సముద్రాల, ఆత్రేయ, కరుణశ్రీ, ఘంటసాల, కెఎల్ నర్సింహారావు అవార్డులు పొందాను. కర్ణాటక సంగీతంలో వాగ్గేయకారులు, జావళీలు, హరికథలు, యక్షగానాలు సినిమాల్లోకి అనువందించబడ్డ తీరు, సాహిత్య పరంగా అందులో ఉన్న విలువలను వ్యాసాల రూపంలో మిసిమి మాస పత్రికలో ప్రచురితమయ్యాయి. 2021 జనవరి నుంచి జూన్ వరకు ప్రచురితమైన వ్యాసాలను 2023 మే నెలలో జాతీయ చలన చిత్ర అవార్డు కోసం దరఖాస్తు చేశాను. జ్యూరీ సభ్యులు ఎంపిక చేసి ఉత్తమ సినీ విమర్శకుడిగా అవార్డు ప్రకటించారు.

**సాహిత్యాన్ని అలవర్చుకోవాలి**

నేటి యువత సమయం లేదని సాహిత్యం పట్ల ఆసక్తి చూపడం లేదు. సాహిత్యంలో రచనలు, అధ్యయనాలు పెరగాల్సిన అవసరం ఉంది. పాశ్చాత్య, భారత సంగీతాల మూలం శాస్త్రీయ సంగీతమే. సంగీతం వల్ల తాత్కాలిక ఆనందం పొందడం కాకుండా అందులోని సాహిత్యాన్ని ఆస్వాదించాలి. మనలో ప్రతిభ లేకుంటే ఏమీ సాధించలేము. ప్రతిభ ఉంటేనే అవార్డులు, ప్రశంసలు వస్తాయి.

### ● వరలక్ష్మీ వ్రతం





శ్రావణశుక్రవారాన్ని పురస్కరించుకుని సూర్యాపేటలోని సంతోషిమాత దేవాలయంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు, అనంతరం వాయినాలు ఇచ్చుకుంటూ..

# టీచర్ కొలువులపై ఆశలు

- ఉపాధ్యాయ నియామకాలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- జిల్లాలో గుర్తించిన ఖాళీ పోస్టులు 744
- ప్రభుత్వానికి నివేదించింది 185
- త్వరలో విడుదల కానున్న డీఎస్సీ నోటిఫికేషన్
- ఆనందంలో బీఈడీ, డీఈడీ అభ్యర్థులు



**సూర్యాపేట టౌన్:** ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ (డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ) ద్వారా భర్తీ చేస్తామని తాజాగా విద్యాశాఖ మంత్రి ప్రకటించింది. దీంతో డీఈడీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థుల్లో ఉపాధ్యాయ నియామకాలపై ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 744 పోస్టులు ఖాళీలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అయితే ఇందులో 185 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వానికి నివేదిక పంపారు. కానీ ఎన్ని పోస్టులకు ఉద్యోగ ప్రకటన వెలువరిస్తారోనన్న పూర్తిస్థాయి వివరాలు మరో రెండు రోజుల్లో స్పష్టం కానుండడంతో అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. గతేడాది బదిలీల ప్రక్రియను ప్రారంభించినప్పటికీ, కోర్టు జోక్యంతో మధ్యలోనే ఆగిపోయింది. దీనికి తోడు కొన్నేళ్లుగా విద్యావలంటీర్ల నియమకాన్ని చేపట్టడం లేదు. ఫలితంగా జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు తదితర కారణాలు విద్యా ప్రమాణాల పెంపుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి.

**జిల్లావ్యాప్తంగా 3,224 మందే టీచర్లు**

జిల్లాలో 950 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 67వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి 3,968 మంది ఉపాధ్యాయులు అవసరముండగా ప్రస్తుతం 3,224 మందే ఉన్నారు. ఇంకా 744 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది.

| ఖాళీ పోస్టులు | |
|---|---|
| జీహెచ్‌ఎం | 106 |
| స్కూల్ అసిస్టెంట్లు | 286 |
| ఎస్‌జీటీలు | 222 |
| పీఈటీలు | 03 |
| ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు | 104 |
| ఎల్‌పీటీలు | 11 |
| ఎల్‌పీహెచ్‌లు | 12 |
| మొత్తం | 744 |

| భర్తీ చేసే పోస్టులు | |
|---|---|
| ఎస్‌ఏలు | 80 |
| ఎస్‌జీటీలు | 78 |
| ఎల్‌పీలు | 23 |
| పీఈటీలు | 04 |
| మొత్తం | 185 |

**ఆరేళ్లుగా నిరీక్షణ..**

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన 2017లో టీఆర్‌టీని నిర్వహించారు. ఆ తర్వాత నుంచి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోవడంతో అభ్యర్థులు అప్పటి నుంచి నిరీక్షిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఎలాగైనా టీచర్ పోస్టులను భర్తీ చేస్తుందనే నమ్మకంతో ఏటా బీఈడీ, డీఈడీ కోర్సుల్లో చేరే వారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు నోటిఫికేషన్‌ను సైతం జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే వచ్చే నెల 15న పరీక్ష నిర్వహించనున్నారు. ఫలితాలు అదేనెల 27న ప్రకటించనుండడంతో తాజాగా విడుదలయ్యే నోటిఫికేషన్‌కు మరింత మంది నిరుద్యోగులు అర్హత సాధించే అవకాశం ఉంది. గత ఏడాది టెట్ రాసి క్వాలిఫై అయిన వారు పేపర్–1లో 3,694 మంది అభ్యర్థులు కాగా ప్రస్తుతం టెట్ రాసేందుకు 10,026 మంది అభ్యర్థులు ఉన్నారు. పేపర్–2లో గత ఏడాది 5,491 మంది అర్హత సాధించగా ప్రస్తుతం 6,513 మంది అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు.

**సర్దుబాటుతో వెళ్లదీస్తూ..**

గతంలో పాఠశాలల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల్లో విద్యావలంటీర్ల నియామకం వల్ల సమస్యకు కాస్త అధిగమించారు. కానీ, కరోనా నుంచి విద్యావలంటీర్లను మరలా నియమించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధించే వారు లేక ఇబ్బందులు తీవ్రమయ్యాయి. దీనిని గుర్తించిన విద్యాశాఖ గతేడాది జూలైలో కొందరు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసింది. వీరంతా విద్యా సంవత్సరం చివరి రోజున నిర్దేశిత పాఠశాలలో మళ్లీ రిపోర్టు చేశారు. మళ్లీ జిల్లాలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి టీచర్లు లేని పాఠశాలలకు పక్కన ఉన్న టీచర్లను సర్దుబాటు చేశారు. ఈ విద్యాసంవత్సరం కూడా సర్దుబాటుతోనే వెళ్లదీస్తున్నారు.

# 1,930 మెగావాట్ల వాడకం

## వానాకాలంలోనూ పెరిగిన విద్యుత్ డిమాండ్

- వ్యవసాయానికి అధికంగా వినియోగం
- గరిష్ట ఉష్ణోగ్రతల నమోదుతో ఏసీలు, కూలర్ల వాడకం
- గతేడాది ఇదే రోజున 1,535 మెగావాట్లు..



ఈ వారంలో ఉష్ణోగ్రతలు ఇలా..

| తేదీ | గరిష్ట ఉష్ణోగ్రత |
|---|---|
| 19 | 30 |
| 20 | 33 |
| 21 | 34 |
| 22 | 35 |
| 23 | 35 |
| 24 | 34 |
| 25 | 36 |



**నల్లగొండ :** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదువుతోంది. వేసవి కాలం తరహాలోనే ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ పెరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో 1,930 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. పదేళ్ల కాలంలో వానాకాలంలో ఇంత అత్యధికంగా విద్యుత్ వినియోగం కావడం ఇదే మొదటిసారి. గత సంవత్సరం ఇదే రోజు జిల్లాలో 1,530 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదు కాగా గురువారం 1,951 మెగావాట్లు, శుక్రవారం 1,930 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. హైదరాబాద్ జంట నగరాల విద్యుత్ డిమాండ్‌లో సగానికి మించి ఉమ్మడి నల్లగొండ జిల్లా విద్యుత్ డిమాండ్ పెరిగింది. హైదరాబాద్ జంట నగరాల్లో శుక్రవారం 2,993 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదు కాగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1,930 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది.

**పంటలను కాపాడేందుకు..**

ఉమ్మడి జిల్లాలో దాదాపు ఏడు లక్షల వరకు వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం, రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తుండడంతో విద్యుత్ డిమాండ్ పెరిగింది. సాగర్‌లో నీరు లేని కారణంగా ఆయకట్టులో కూడా రైతులు బోర్లు వేసి వరి సాగు చేస్తున్నారు. నాన్ ఆయకట్టులోనూ రైతులు ఎక్కువగా బోర్లపై ఆధారపడి వరి వేశారు. ప్రస్తుతం గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షాలు కూడా కురవకపోవడంతో పంటలు ఎండిపోయే ప్రమాదం దాపురించింది. పంటలను కాపాడుకునేందుకు రైతులు నిరంతరాయంగా మోటార్లు వాడుతూ బోర్లలోని నీటిని తోడుతున్నారు.

**పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..**

ఈ నెలలో వారం రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. దీంతో ప్రజలకు ఎక్కువగా ఇళ్లలోనే ఉంటున్నారు. ఉక్కపోతను తట్టుకోలేక ఏసీలు, కూలర్లను వాడుతున్నారు. దీంతో అటువ్యవసాయ వినియోగం, ఇళ్లలో కూడా కరెంట్ వాడకం పెరగడంతో విద్యుత్ డిమాండ్ అధికంగా నమోదువుతోంది.

### శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

**మఠంపల్లి:** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. కల్యాణతంతులో భాగంగా స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. తర్వాత కల్యాణం నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాబాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

### సీసీ కెమెరాల ఏర్పాటు చాలా అవసరం

- ఏఎస్పీ నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

**కోదాడ రూరల్:** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు చాలా అవసరమని అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నేరాల నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించడం చాలా సులభమన్నారు. వ్యాపారులు, అపార్ట్‌మెంట్ నివాసులు కూడా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమన్నారు. మీమీ ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎక్కువ రోజులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే బంగారు ఆభరణాలు, నగదును ఇంట్లో పెట్టి వెళ్లవద్దని సూచించారు. సమావేశంలో డీఎస్పీ ప్రకాష్, పట్టణ ప్రముఖులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో పోటీతత్వం పెంచాలి

- కలెక్టర్ వెంకట్రావు

**దురాజ్‌పల్లి (సూర్యాపేట):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సిలబస్‌లోని అంశాలతో పాటు కాంపిటేటివ్ పరీక్షలు సమర్థవంతంగా ఎదుర్కొనేలా వారిలో ఉపాధ్యాయులు పోటీతత్వాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ ఎంస్.వెంకట్రావు కోరారు. శుక్రవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్ ), యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో నేషనల్ మీన్స్‌కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు ప్రిపేరయ్యే ప్రభుత్వ విద్యార్థులకు అందించేందుకు రూపొందించిన ఉచిత స్టడీ మెటీరియల్‌ను కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి యామా రమేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రామ్మూర్తి, జిల్లా కోశాధికారి అమరవాది బ్రహ్మాచారి, జిల్లా ఉపాధ్యక్షులు బైరు తిరుమలేష్, మంచాల రవి కుమార్, జిల్లా కార్యదర్శి బట్టిపల్లి సాయికుమార్, నాగారం మండల అధ్యక్షుడు జుట్టుకొండ నవీన్, చివ్వెంల మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం**

నూతన కలెక్టరేట్‌లో అన్ని శాఖల కార్యాలయాలు ఒకేచోట ఉండడం వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. శుక్రవారం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీటీఓ రవికుమార్, డీడబ్ల్యూఓ జ్యోతి పద్మతో కలిసి నూతన కలెక్టరేట్‌లో వారికి కేటాయించిన రూం నంబర్ జీ–6, జీ–1, జీ–12లలో కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాలనాసౌలభ్యం కోసమే ప్రభుత్వం అన్ని శాఖల కార్యాలయాలు ఒకేచోట ఉండే కొత్త కలెక్టరేట్‌ను నిర్మించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఓలు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, ఎస్‌టీఓలు, సీడీపీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.






స్టడీ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీటీఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

# ఉనికి లేని 'ఆత్మ'

- ముందుకు సాగని కేంద్ర ప్రభుత్వ పథకం
- ఐదేళ్లుగా విడుదలకాని నిధులు
- సాగుపై సలహాలు, సూచనలు కరువు
- సదస్సులు, ప్రదర్శనల ఊసేలేదు
- పథకాన్ని పునరుద్ధరించాలంటున్న రైతులు




**భానుపురి (సూర్యాపేట):** పంటల సాగులో రైతాంగాన్ని నిత్యం చైతన్యపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) పథకం పడకేసింది. కొన్నేళ్లుగా ఎలాంటి సమావేశాలు, సదస్సులు నిర్వహించని కారణంగా ఈ పథకం క్రమక్రమంగా కనుమరుగవుతోంది. ప్రస్తుతం జిల్లాలో ఈ పథకం ఉనికే లేకుండా పోయింది. ఇటు అధికారులు, అటు ఆత్మ ప్రతినిధులు కార్యక్రమాల జోలికే పోకపోవడంతో సదస్సులు, ప్రదర్శనలు, రైతు అవగాహన కార్యక్రమాలు, విహార యాత్రలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ప్రధానంగా వ్యవసాయ యాంత్రీకరణపై దీని ప్రభావం అధికంగా పడింది. అలాగే పత్తి, కంది, పెసర, వరి, శనగ తదితర పంటల సాగుపై సలహాలు, సూచనలు కరువయ్యాయి.


**నిధుల లేమితో ముందుకు సాగట్లే..!**

పథకం ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం ఏటా బడ్జెట్‌లో నిధులను కేటాయిస్తూ ఉండడంతో సంబంధిత అధికారులు చేపట్టి పంటల సాగు కోసం సూచనలు, సలహాలు అందిస్తుండేవారు. ఇందుకోసం ప్రత్యేకమైన సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల వ్యవసాయ క్షేత్రాల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండేవారు. అయితే ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఈ ఆత్మ పథకానికి నిధులను కేటాయించడం లేదు. దీంతో వ్యవసాయ అధికారులు, సంబంధిత సిబ్బంది నిధుల లేమితో కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రావడం లేదు. ఫలితంగా వరితోపాటు ఇతర మెట్ట పంటల సాగుకు సలహాలు, సూచనలు కరువయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో వరి సాగు విస్తీర్ణం పెరిగి మెట్ట పంటలను సాగు చేసే రైతులు తగ్గుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఆత్మ పథకానికి నిధులు కేటాయించడంతోపాటు సిబ్బందిని నియమించి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో జిల్లాలో పప్పు ధాన్యాల సాగు పెరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

**2001లో పథకం ప్రారంభం..!**

కేంద్ర ప్రభుత్వం 2001వ సంవత్సరంలో ఆత్మ పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలో ప్రత్యేకమైన కమిటీలు ఏర్పాటు చేయగా...ఇందులో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయ అధికారి కన్వీనర్‌గా ఉండేవారు. డివిజన్ స్థాయిలో సలహా కమిటీలూ ఉండేవి. ఆత్మ పథకంలోని సిబ్బంది, అధికారులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి యంత్రాలతో ప్రదర్శన నిర్వహించి రైతులకు సాంకేతికతపై అవగాహన కల్పించాల్సి ఉంది. పశుసంవర్ధక శాఖ, ఉద్యాన శాఖ, మత్స్య శాఖల్లో సాంకేతికంగా వచ్చే మార్పులను అధికారులు రైతులకు వివరించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం ఏటా నిధులను మంజూరు చేసేది.

**ఈ పథకానికి నిధులు కేటాయించాలి**



కేంద్ర ప్రభుత్వం గతంలో చేపట్టిన ఆత్మ పథకాన్ని పునరుద్ధరించాలి. వివిధ పంటలను సాగు చేయాలంటే అవగాహన కల్పించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. వ్యవసాయ అధికారులకు పంటల నమోదు, తదితర ఎన్నో కార్యక్రమాలు ఉంటుండడంతో సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. వెంటనే ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను కేటాయిస్తే బాగుంటుంది.

– ఉప్పుల మల్లయ్య, రైతు, ఆత్మకూర్(ఎస్)

## క్లుప్తంగా

### వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం


శ్రీనివాస్‌రెడ్డి

రామన్నపేట: వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. వివరాలిలా ఉన్నాయి. రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన ఎర్రంబెల్లి శ్రీనివాస్‌రెడ్డి అనే యువకుడు శుక్రవారం అదృశ్యమైనట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు. గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి చిన్నకుమారుడు శ్రీనివాస్‌రెడ్డి బిజినెస్ పనిమీద బయటకు వెళ్తున్నానని చెప్పి ఉదయం బయటకు వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

**పేర్వాలలో మహిళ..**


పార్వతమ్మ

చందంపేట: నేరెడుగొమ్ము మండలంలోని పేర్వాల గ్రామానికి చెందిన సన్నాయిల పార్వతమ్మ(36) ఈనెల 23న తన సొంత పనినిమిత్తం కొండమల్లేపల్లి మండల కేంద్రానికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో భర్త నేరెడుగొమ్ము పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

**మతిస్థిమితం సరిగా లేని మహిళ..**


అనీఫా

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండలంలోని గౌస్‌కొండ గ్రామంలో మతిస్థిమితం సరిగా లేని మహిళ శుక్రవారం అదృశ్యమైంది. గ్రామానికి చెందిన పుట్టుకతో మూగ, చెవిటి అయిన ఎండీ అనీఫా(40)కు మతిస్థిమితం సరిగాలేదు. దీంతో ఆమెకు వివాహం కూడా కాలేదు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లినా అనీఫా సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

### కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండల పరిధిలోని గాయంవారిగూడెం గ్రామ ఆవాసం బంగారు తండా సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు గ్రే కలర్ ఫుల్ షర్ట్, చామనచాయ కలిగి ఉన్నాడని, వయస్సు 35 ఉండొచ్చని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సూర్యాపేట సీఐకి గాని, చివ్వెంల ఎస్‌ఐ విష్ణుమూర్తి సెల్ నంబర్ 87126 86006 సంప్రదించాలని కోరారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి


మృతి చెందిన బిర్రు ధనుష్

రాజాపేట: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాజాపేట, కోదాడ, చిట్యాల, పెన్‌పహాడ్ మండలాల్లో చోటుచేసుకున్నాయి. వివరాలిలా ఉన్నాయి. బొందుగుల గ్రామానికి చెందిన కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి తన కారులో రాజాపేట మీదుగా హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈక్రమంలో రాజాపేట మండలం మండల కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో బిర్రు శ్యామ్‌సుందర్ చిన్న కుమారుడు ధనుష్(6) రోడ్డు మార్గంగా వస్తుండగా ప్రమాదవశాత్తు కారు బాలుడిని ఢీ కొట్టింది. దీంతో ధనుష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు శ్రీనివాస్‌రెడ్డి కారులో భువనగిరి ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే ధనుష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి శ్యాంసుందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపారు.

**బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు..**

కోదాడరూరల్: బైక్‌ను కారు ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని హైదరాబాద్- విజయవాడ రహదారిపై న్యూవిజన్ స్కూల్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తూరుకు చెందిన గోలి బోజప్ప(45) మునగాల మండలంలోని ఆకుపాముల శివారులోగల అగ్రినెస్ట్ కాలేజీలో వంటమనిషిగా పనిచేస్తున్నాడు. ఓ పని నిమిత్తం కాలేజీ డైరెక్టర్ కీర్తిలక్ష్మీని ఎక్కించుకొని కోదాడకు వస్తున్నాడు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బోజప్పకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కీర్తిశ్రీలక్ష్మీకి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు శౌరీబోజిరాజు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రామాంజనేయులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


చిట్యాల: సంఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**డీసీఎం ఢీకొని..**

చిట్యాల: చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడిని డీసీఎం వెనుక నుంచి ఢీ కొట్టడంతో మృతిచెందాడు. నల్లగొండ జిల్లా దుప్పలపల్లి గ్రామానికి చెందిన ప్రదీప్ అనే యువకుడు బైక్‌పై హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు జాతీయ రహదారిపై వెళ్తున్నాడు. ఈక్రమంలో చిట్యాల జెడ్పీహైస్కూల్ వద్ద వెనుక నుంచి వచ్చిన డీసీఎం ఢీకొట్టడంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**కుక్కలు అడ్డురావడంతో..**

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకన్నగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన పల్ల చినపాపయ్య(54), భార్య వీరమ్మ వృత్తిరీత్యా చేపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం వీరిద్దరు సూర్యాపేటకు మోటార్ సైకిల్‌పై వెళ్లి చేపలను విక్రయించి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో అనంతారం గ్రామ శివారులో అకస్మాత్తుగా మోటర్ సైకిల్‌కు కుక్కలు అడ్డువచ్చాయి. దీంతో అదుపు తప్పి కిందపడిపోగా చినపాపయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరమ్మకు స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం చినపాపయ్యను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## అకస్మాత్తుగా లారీ యూటర్న్.. ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- పలువురు ప్రయాణికులకు గాయాలు


లారీని ఢీకొట్టిన బస్సు

చౌటుప్పల్: చౌటుప్పల్ మండల పరిధిలోని ఖైతాపురం గ్రామ స్టేజీ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం అకస్మాత్తుగా లారీ యూటర్న్ తీసుకోవడంతో ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన మెట్రో బస్సు 20మంది ప్రయాణికులతో చౌటుప్పల్‌కు వస్తోంది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు ఓ లారీ అకస్మాత్తుగా యూటర్న్ అయ్యింది. ఎలాంటి ముందస్తు సూచికలు లేకుండానే లారీ వేగంగా అడ్డు రావడంతో బస్సు లారీని ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ దవూరియా (56)తో పాటు పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బస్సు కండక్టర్ మధన్‌మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మునగాల(కోదాడ): హైదరాబాద్‌లోని బాలాపూర్ మండలం సాయినగర్‌కు చెందిన దేరంగుల శివకుమార్ శుక్రవారం మునగాల మండల కేంద్రం శివారులో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివకుమార్ వృత్తిరీత్యా డ్రైవర్. ఐదు నెలల క్రితం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తుర్కగూడకు చెందిన నవీనతో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య వివాదం నెలకొనడంతో భార్య నవీన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో మనస్తాపానికి గురైన శివకుమార్ గురువారం తన ద్విచక్ర వాహనంపై ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో శివకుమార్ తల్లి మీర్‌పేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా.. శివకుమార్ నిద్రమాత్రలు మింగి మునగాల శివారులో స్థానిక పెట్రోల్ బంక్ వద్ద తీవ్ర అస్వస్థతకు గురై పడి ఉన్నాడు. దీంతో స్థానికులు 108, 100కు డయల్ చేయడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని శివకుమార్‌ను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. శివకుమార్ జేబులో తాను భార్య మీద కోపంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు చీటి రాసి ఉంది. ఈమేరకు పోలీసులు శివకుమార్ తల్లికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. శివకుమార్ తల్లి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి చేరుకుని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కాగా శివకుమార్ సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనాన్ని కుటుంబసభ్యులకు అప్పగించి మీర్‌పేట పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇచ్చినట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతిచెందిన యాకయ్య

తిరుమలగిరి (తుంగతుర్తి): చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన తిరుమలగిరి మండలం మామిడాల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండ్ యాకయ్య గురువారం సాయంత్రం నలుగురు యువకులతో కలిసి గ్రామం పక్కనే ఉన్న వాగులో చేపల వేటకు వెళ్లాడు. విద్యుత్ షాక్ పెట్టి చేపల వేట సాగిస్తుండగా యాకయ్య తీగను లాగుతుండగా విద్యుదాఘాతానికి గురై బండరాయిపై పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

**దుస్తులు ఆరేస్తుండగా మహిళ..**

దేవరకొండ: దేవరకొండ మండలంలోని కొమ్మేపల్లిలో గురువారం విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పగిళ్ల చంద్రమ్మ(68) రజక వృత్తి కొనసాగిస్తూ జీవనం సాగిస్తోంది. గురువారం గ్రామంలోని దాసరి లింగయ్య ఇంట్లో దుస్తులు ఉతికి ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు దండెం వైరుకు విద్యుత్ సరఫరా జరిగి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు నిరంజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నాగిరెడ్డిపల్లిలో కొనసాగుతున్న ‘గేమ్ ఛేంజర్’ షూటింగ్


ఓ సన్నివేశంలో హీరో రాంచరణ్

భువనగిరి: భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో గల శ్రీ భీమరావ్ రైస్ గోదాములో హీరో రాంచరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ సినిమా షూటింగ్ శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా గోదాములోని కల్తీ బియ్యం పట్టుకునే సన్నివేశాలు చిత్రీకరించారు. శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజ్ నిర్మాతగా ఎస్‌వీసీ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రంలోని గోదాముకు సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణ శనివారం కూడా ఇక్కడే కొనసాగనుంది.

## మంత్రి క్యాంప్ కార్యాలయం ముట్టడి


బీజేపీ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

సూర్యాపేట: అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సంకినేని వరుణ్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, అర్హులైన లబ్ధిదారులతో కలిసి సూర్యాపేటలోని మంత్రి జగదీష్‌రెడ్డి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. క్యాంప్ ఆఫీస్‌కు బీజేపీ కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం మీడియాతో సంకినేని వరుణ్‌రావు మాట్లాడుతూ మంత్రి జగదీష్‌రెడ్డి 9 సంవత్సరాల పాలనలో 900 డబుల్ బెడ్ రూం ఇళ్లను కూడా కట్టించలేకపోయారని ఆరోపించారు. మంత్రి దత్తత గ్రామం ఏపూర్, చీదెళ్ల గ్రామంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేదలకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కేసారం గ్రామంలో ఏడు సంవత్సరాల నుంచి కడుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్లు నాసిరకంగా ఉన్నాయన్నారు. ఇందిరమ్మ ఫేస్ త్రీ కాలనీలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎందుకు పంచడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, పల్స మల్సూర్‌గౌడ్, చల్లమళ్ల నరసింహ, మీర్ అక్బర్, ఆరూరి శివ, వెన్నె శశికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామ శివారులో శుక్రవారం ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం అనుపాల గ్రామానికి చెందిన గంట గోపికృష్ణ(30) గత ఐదేళ్లుగా హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. జాబ్ పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈక్రమంలో ఇటీవల నల్లగొండలోని స్నేహితుల వద్దకు వచ్చాడు. తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో చెరువుగట్టు గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. తండ్రి రామ్ నర్సింగ్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబా తెలిపారు.

## పద్మశాలీ శంఖారావాన్ని జయప్రదం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలీ నాయకులు

భూదాన్‌పోచంపల్లి : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో సెప్టెంబర్ 3న జరిగే పద్మశాలీ శంఖారావం బహిరంగ సభను జయప్రదం చేయాలని తెలంగాణ పద్మశాలి ప్రాంత యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకింది కిరణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలోని పద్మశాలి చేనేత కార్మిక సంఘం ఆవరణలో బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయంగా, సామాజిక, ఆర్థికంగా వెనుబడిన పద్మశాలీల హక్కుల సాధన కోసం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, ఉపాధ్యక్షుడు బోడ దయానంద్, ప్రధాన కార్యదర్శి భారత బాల శంకర్, సహాయకార్యదర్శి కూరపాటి భాస్కర్, కోశాధికారి బొమ్మ హరిశంకర్, డైరెక్టర్లు గుండు ప్రవీణ్, భారత భూషణ్, గుండు రాజేశ్వరీ, ఏర్వ నీలమ్మ, మంగళపల్లి శ్రీహరి, పాల్గొన్నారు.

## రూ.90కోట్లతో ‘సాగర్’ పర్యవేక్షణ పనులు


నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేను పరిశీలిస్తున్న నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్

- నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో రూ.90 కోట్ల వ్యయంతో ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ పనులు చేపట్టినట్లు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్ తెలిపారు. సాగర్ సందర్శనలో భాగంగా శుక్రవారం ప్రాజెక్టులో రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టిన స్పిల్‌వే మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుడికాలువకు సంబంధించిన 8 హెడ్ రెగ్యులేటర్ గేట్లు, ఎడమకాలువకు సంబంధించిన 3 గేట్లు, ప్రధాన డ్యాంకు సంబంధించి 2 సూట్‌గేట్లు, డ్రైనేజీ హోల్స్, ఫోరస్ హోల్స్‌తో పాటు మరికొన్ని అభివృద్ధి పనులు పరిశీలించామని పేర్కొన్నారు. ఆయన వెంట నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, ఎస్‌ఈ నాగేశ్వరావు, ఈఈ మల్లిఖార్జునరావు, డీఈ పరమేష్ తదితరులున్నారు. అదేవిధంగా బుద్ధవనం, నాగార్జునకొండ, విద్యుదుత్పాదన కేంద్రం తదితర ప్రాంతాలను నీటి పారుదల శాఖ ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ముందుగా లాంచీలో కొండకు చేరుకొని అక్కడి మ్యూజియం, సింహళ విహార్, మహాస్థూపం, అశ్వమేథ యాగశాల, పునర్నిర్మాణ కట్టడాలను పరిశీలించారు. వారికి టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునకొండ చారిత్రక వివరాలను తెలిపారు. అనంతరం బుద్ధవనంలోని బుద్ధునిపాదాల చెంత రజత్‌కుమార్ పుష్పాంజలి ఘటించారు.



## వైభవంగా ఊంజలి సేవోత్సవం


అమ్మవారి సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాల్ అమ్మవారి ఊంజలి సేవోత్సవాన్ని ఆచార్యులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ వీధుల్లో ఆండాల్ అమ్మవారి సేవను ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారికి ఊంజలి సేవోత్సవం జరిపించారు. ఇక ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.

**యాదాద్రీశుడికి వెండి కళశాలు బహూకరణ**

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి హైదరాబాద్‌కు చెందిన హరికృష్ణ - స్వప్న దంపతులు ఐదు వెండి కలశాలను బహూకరించారు. శుక్రవారం శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆలయ ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత ఆలయాధికారి సురేందర్‌రెడ్డికి అందజేశారు. శ్రీస్వామి వారి కైంకర్యాల్లో వీటిని వినియోగించనున్నారు.

**యాదాద్రిలో ప్రముఖుల పూజలు**

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ ఉషారాణి, కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యే సిద్దు సవాది, మహారాష్ట్రలోని సోలాపూర్ ఎమ్మెల్యే సుభాష్ సురేష్ చంద్ర దేశముఖ్‌లు శుక్రవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు వీరికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

## మతిస్థిమితం లేని యువకుడిని ఆశ్రమంలో అప్పగింత

యాదగిరిగుట్ట రూరల్: మతిస్థిమితం లేని ఓ యువకుడిని యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలోని అమ్మఒడి అనాథాశ్రమంలో గ్రామానికి చెందిన సిద్ధి వినాయక యూత్ సభ్యులు గురువారం రాత్రి చేర్పించారు. మానసిక స్థితి సరిగ్గా లేకుండా వరంగల్- హైదరాబాద్ నేషనల్ హైవేపై ఓ వ్యక్తి తిరుగుతుండగా గమనించి ఆశ్రమంలో అప్పగించినట్లు యూత్ సభ్యులు తెలిపారు.

## దేశాన్ని అప్పుల పాలు చేసిన ప్రధాని మోదీ

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్


మాట్లాడుతున్న కేఏ పాల్

సూర్యాపేట రూరల్: ప్రధాని నరేంద్రమోదీ పరిపాలనలో దేశాన్ని బాగు చేసిందేమీ లేదని, దేశాన్ని మొత్తం అప్పుల పాలు చేశారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్తూ మార్గమధ్యలో సూర్యాపేట పట్టణ పరిధిలోని రాయినిగూడెం వద్ద సెవెన్ ఆర్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశంలో 54ఏళ్లు కాంగ్రెస్ పార్టీ కుటుంబ పాలన సాగిందని, కానీ దేశానికి చేసిందేమీ లేకపోగా అప్పుల పాలు చేశారన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ మొత్తం వాష్‌అవుట్ అయిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు ఎక్కడ రాజధాని అంటే చెప్పుకోలేని పరిస్థితిలో ప్రజలు ఉన్నారన్నారు. తెలంగాణలో 119 అసెంబ్లీ సీట్లలో ప్రజాశాంతి పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు.

## వలకు చిక్కిన 25 కిలోల చేప


మత్స్యకారుడికి చిక్కిన చేప

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలం పులగంబండ తండాలోని చెరువులో శుక్రవారం అదే గ్రామానికి చెందిన బడావత్ పాండునాయక్ చేపల వేటకు వెళ్లగా.. 25 కిలోల చేప చిక్కింది. ఈ చేపను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

**అరుదైన చేప లభ్యం**



నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి మూసీ నదిలో శుక్రవారం స్థానిక మత్స్యకారులకు అరుదైన చేప చిక్కింది. ఈ చేప సుమారు రెండు కిలోల బరువు ఉంటుందని వారు తెలిపారు.

## వట్టె జానయ్య యాదవ్‌పై పలు కేసులు

సూర్యాపేట రూరల్: సూర్యాపేట పట్టణ పరిధిలోని గాంధీనగర్, పిల్లలమర్రి రెవెన్యూ శివారులో భూములను ఆక్రమించడంతోపాటు, అక్రమాలకు పాల్పడ్డారని ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, మరికొందరిపై పలువురు భూ బాధితులు శుక్రవారం సూర్యాపేట రూరల్‌పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు వారిపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణానికి చెందిన శ్రీరామోజు వెంకటేశ్వర్లు, శ్రీరామోజు శ్రీనివాసచారిలు పిల్లలమర్రి రెవెన్యూ శివారులో సర్వే నంబర్ 481 విస్తీర్ణంలో 7,098 చదరపు గజాల భూమిని 2008లో కొనుగోలు చేశారు. ఈ భూమిని డీసీఎంఎస్ చైర్మన్ వట్టే జానయ్య యాదవ్, గండమళ్ల వెంకన్న, మాలోతు వెంకన్న ఎలాంటి అనుమతి లేకుండా వెంచర్ ఏర్పాటు చేసి, రోడ్డు వేసి, వాటర్ ట్యాంక్ నిర్మించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. అదేవిధంగా బాలెంల గ్రామానికి చెందిన వల్లెం శేఖర్ తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్తుండగా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, గండమళ్ల వెంకన్న 10మంది అనుచరులతో వచ్చి దాడిచేసి భూమి మీదకు రానివ్వకుండా దాడి చేశారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన పెండెం క్రిష్ణ, భార్య సత్తెమ్మలు పిల్లలమర్రి గ్రామ రెవెన్యూ శివారులోని తమ భూమిని ఆక్రమించాడని ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన పెండెం క్రిష్ణ పిల్లలమర్రి శివారులో సర్వే నంబర్ 296, 295, 294లలో 10ఎకరాల భూమిని సిరికొండ వెంకటరమణారావు, గాలి సుధీర్‌కు అమ్మాడు. ఈ భూమిని వెంకటరమణారావు, సుధీర్‌లు వట్టే జానయ్య యాదవ్‌కు అమ్మారు. అయితే కృష్ణకు వాయిదా ప్రకారం డబ్బులు చెల్లించలేదు. వట్టే జానయ్య యాదవ్, పిల్లలమర్రి ఉపేందర్‌లు బాధితుడు పెండెం కృష్ణ తెలియకుండా అతని సంతకం ఫోర్జరీ చేసి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి పాట్లు చేసి అమ్ముతున్నాడని బాధితుడు క్రిష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇలా పలు భూ ఆక్రమణల నేపథ్యంలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

## బీఆర్‌ఎస్ టికెట్ స్థానికుడికే ఇవ్వాలి

- సాగర్ నియోజకవర్గ అసంతృప్త నేతల సమావేశంలో తీర్మానం


మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్

గుర్రంపోడు: నాగార్జునసాగర్ అసెంబ్లీ నియోజకవర్గ టికెట్‌ను నోముల భగత్‌కు కాకుండా స్థానికునికే టికెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతూ నియోజకవర్గ అసంతృప్త నేతల సమావేశంలో తీర్మానించారు. గుర్రంపోడు మండలంలోని బొల్లారం గ్రామంలో శుక్రవారం మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్ ఆధ్వర్యంలో ముగ్గురు ఎంపీపీలు, జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీలతోపాటు ముఖ్య నేతలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌ను మార్చేలా అధిష్టానంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రతి మండలంలో అసంతృప్త ఆత్మీయ సభలతోపాటు నియోజకవర్గ స్థాయిలో 20వేల మందితో సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఆయనను మార్చకపోతే ఇండిపెండెంట్‌గా బరిలో ఉండాలని పలువురు అసంతృప్త నేతలు అభిప్రాయపడ్డారు. ఈసందర్భంగా మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో సమర్థవంతమైన స్థానిక నాయకత్వం ఉన్నందున ఎమ్మెల్యేగా స్థానికుడికే టికెట్ ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే నోముల భగత్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ కార్యకర్తలపైనే పోలీసు కేసులు పెట్టించి వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. సమావేశంలో తిరుమలగిరి ఎంపీపీ భగవాన్ నాయక్, పెద్దవూర ఎంపీపీ అనురాధా సుందర్‌రెడ్డి, హాలియా ఎంపీపీ సుమతీ పురుషోత్తం, వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పాశం గోపాల్‌రెడ్డి, వెల్గపూరి కరుణాకర్‌రావు, మేరెడ్డి జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంకిత వెంకటరమణ, అల్లి పెద్దిరాజు, నాయకులు కేవీ రామారావు, షేక్ అంజన్, జానయ్య గౌడ్, నడ్డి లింగయ్య, భరత్‌రెడ్డి, బుర్రి రాంరెడ్డి, వెంకన్న గౌడ్, సైదులు, నాగరాజు, నగేష్‌గౌడ్, కిరణ్, భాస్కర్, నర్సింహారావు పాల్గొన్నారు.